మాయమాటల కాంగ్రెస్

- అబద్ధాలకోరు.. అడ్డగోలు హామీలు : ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య
- ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయాల్సిందే
- నేడు కలెక్టర్లకు, మున్సిపల్ కమిషనర్లకు వినతి పత్రాలు : బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్
- బాలసముద్రంలోని ఏకశిలా పార్కు వద్ద నిరసన

హనుమకొండ, మార్చి 6 : అబద్ధాల కోరు.. అడ్డగోలు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎల్ఆర్ఎస్ విషయంలో ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధిష్ఠానం, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లో బుధవారం ధర్నా చేశారు. వరంగల్ పశ్చిమ నియోజక వర్గం పరిధిలో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఇతర నాయకులు హాజరయ్యారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ధర్నాను ఉద్దేశించి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ విషయంలో కాంగ్రెస్ పార్టీ తీరు మార్చుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ నాడు ఎల్ఆర్ఎస్ ఉచితమని చెప్పి, ఇప్పుడు ఫీజు కట్టమని కాంగ్రెస్ అంటుందని మండిపడ్డారు. అమలుకాని, ఉచిత హామీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. పేద, మధ్య తరగతి కుటుంబాలపై పెను భారం మోపి రూ.20వేల కోట్లు వసూళ్లకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేసే వరకూ కొట్లాడుతామన్నారు. అలాగే, బాలసముద్రంలోని నిర్మించిన పార్టీ కార్యాలయం గురించి మాట్లాడుతూ పార్టీ ఆఫీస్‌ను చట్టబద్ధంగా నిర్మించామని, దాని జోలికి రావొద్దన్నారు. ఎల్ఆర్ఎస్ విషయంలో నేడు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లకు వినతి పత్రాలు అందజేయనున్నట్లు వినయ్ భాస్కర్ తెలిపారు. మహిళా దినోత్స

వరంగల్ చౌరస్తాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

వాన్ని పురస్కరించుకుని గురువారం మధ్యాహ్నం జిల్లా పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్లు సుందర్ రాజ్ యాదవ్, మర్రి యాదవ్‌రెడ్డి, పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ జనార్దన్ గౌడ్, సల్వాజి రవీందర్‌రావు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు

వరంగల్ చౌరస్తా: అబద్ధాలు, మోసపూరిత హామీల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుతున్న విషయాన్ని ప్రజలు గుర్తిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. నన్నపునేని ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలతో వరంగల్ చౌరస్తాలో ఎల్ఆర్ఎస్ ఫీజుకు వ్యతిరేకంగా మహాధర్నా నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ పథకాన్ని అడ్డుగా పెట్టుకొని ప్రజల నుంచి రూ. 20 వేల కోట్లు దోచుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్, కార్పొరేటర్లు గందె కల్పన, వీసువర్ణ, మరుపల్ల రవి, సిద్దం రాజు, పల్లం పద్మ, నాయకులు పల్లం రవి, మసూద్, బజ్జూరి వాసు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌కు ఫీజు వసూలు చేయొద్దు

వర్ధన్నపేట : కాంగ్రెస్ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఎలాంటి రుసుం లేకుండా ఎల్ఆర్ఎస్ అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్ డిమాండ్ చేశారు. బుధవారం నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా, రాస్తారోకో నిర్వహించాయి. వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అరూరి మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్‌ను ఎలాంటి ఫీజు లేకుండా ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, బీఆర్ఎస్ నాయకులు రాకేశ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, పులి శ్రీనివాస్, పర్వతగిరి, ఐనవోలు, వర్ధన్నపేట మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఉచితంగా క్రమబద్ధీకరించాలి

నర్సంపేట: పేదల భూములను ఉచితంగా క్రమబద్ధీకరించాలని, ఎన్నికల్లో ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు మాట మార్చడం తగదని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్ అన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నర్సంపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎం వెంకట్‌రెడ్డి, బండి రమేశ్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, కౌన్సిలర్లు నాగిశెట్టి పద్మా ప్రసాద్, దేవోజు తిరుమలా సదానందం, గందె రజితా చంద్రమౌళి, రామస హాయం శ్రీదేవీ సుధాకర్‌రెడ్డి, గంప రాజేశ్వర్‌గౌడ్, కార్యదర్శి వెన్నముద్దల శ్రీధర్‌రెడ్డి, రావుల సతీశ్, బీరం నాగిరెడ్డి, పెండ్యాల యాదగిరి, చుక్క అనిల్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

పార్లమెంట్ ఎన్నికల కోసమే ప్రలోభాలు

రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి, మార్చి 6: దేశవ్యాప్తంగా జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రయోజనం పొందాలన్న దురుద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం పథకాలను ప్రారంభిస్తున్నదని, రాష్ట్రంలోని సబ్బండ వర్గాల ప్రజలను ప్రలోభపెట్టేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నదని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహానాయక్ అధ్యక్షతన బుధవారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పాలనా పగ్గాలు చేపట్టిన నాటి నుంచే రాష్ట్రంలోని రైతాంగానికి సాగునీరందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మండు వేసవిలోనూ చెరువులు, కుంటలు, రిజర్వాయర్లన్నీ నిండుకుండలా దర్శనమిచ్చాయని గుర్తుచేశారు. నేడు జలాశయాలన్నీ వట్టిపోయి కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ జిమ్మిక్కులన్నీ ప్రజాక్షేత్రంలో బట్టబయలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగు కుమార్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ బిల్ల సురేందర్‌రెడ్డి, నాయకులు గబ్బెట బాబు, పూస మధు, కర్ర రవీందర్‌రెడ్డి, నాగపురి రాంబాబు పాల్గొన్నారు. అనంతరం కొండూరుకు చెందిన పార్టీ గ్రామ మాజీ అధ్యక్షుడు పోల్నేని శ్యామ్‌రావు, మైలారం గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ కార్యకర్త పోతర్ల సమ్మయ్య కుటుంబ సభ్యులను ఎర్రబెల్లి పరామర్శించారు.

ఫసాడ్ సౌండ్ అండ్ లైట్స్ షోకు ఏర్పాట్లు పూర్తి

ఖిలావరంగల్, మార్చి 6: ఓరుగల్లు కోటలోని కీర్తి తోరణాల ప్రాంగణంలో ఫసాడ్ ఇల్యూమినేషన్ సౌండ్ అండ్ లైట్స్ షోకు కేంద్ర పురావస్తు శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. గురువారం రాత్రి 7 గంటలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు కేంద్ర పురావస్తు శాఖ జిల్లా అధికారి ఎం మల్లేశం తెలిపారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

సుబేదారి, మార్చి 6: ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. హనుమకొండ రాంనగర్‌కు చెందిన గుడికందుల చరణ్ తేజ(17) ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి పెట్టుకొని ఆత్మహత్యకు చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సుబేదారి పోలీసులు తెలిపారు.

వరంగల్ ఏసీపీగా నందిరాం నాయక్

సుబేదారి, మార్చి 6 : వరంగల్ సీఐడీ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న నందిరాం నాయక్ వరంగల్ ఏసీపీగా నియామకయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న బోనాల కిషన్ నిజామాబాద్ సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

సంగెం, మార్చి 6 : అప్పుల బాధతో ఒకరు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. గవిచర్ల గ్రామానికి చెందిన గుళ్లపెల్లి కుమారస్వామి(42) చేసిన అప్పులు ఎలా తీర్చాలని కొద్ది రోజులుగా బాధపడుతున్నాడు. ఈ విషయంపై భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. మనస్తాపం చెందిన కుమారస్వామి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి తల్లి, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లి యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్ నరేశ్ తెలిపారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం : ఎమ్మెల్యే రేవూరి

నడికూడ, మార్చి 6 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. బుధవారం నడికూడలో పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఇటీవల ఎన్నికల వరకు బీఆర్ఎస్, బీజేపీలో తిరిగిన స్థానిక నాయకులు కాంగ్రెస్‌లోకి వస్తుండడంతో ప్రజలు విసుగు చెందడం కొసమెరుపు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి దొమ్మాటి సాంబయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు దేవేందర్, మలహల్ రావు, స్థానిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఏసీఎస్ గోదాం ప్రారంభం

సంగెం : మండలంలోని కాపులకనపర్తి ఎఫ్‌ఏసీఎస్ ఆధ్వర్యంలో సోమ్లాతండాలో నిర్మించిన గోదాంను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రారంభించారు. ఎంపీపీ కందకట్ల కళావతి, జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ దొమ్మాటి సంపత్‌గౌడ్, తీగరాజుపల్లి మాజీ సర్పంచ్ కర్జుగుత్త రమ, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

లా పరీక్ష అరగంట ఆలస్యం..

హనుమకొండ చౌరస్తా, మార్చి 6: కేయూ పరీక్షల నియంత్రణాధికారుల నిర్లక్ష్యంతో పరీక్ష పేపర్ అరగంట ఆలస్యంగా వచ్చింది. మూడేళ్లు, ఐదేళ్ల లా సెమిస్టర్ పరీక్షలు బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా అరగంట తర్వాత పేపర్ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. దీనిపై పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారిని వివరణ కోరగా ఆలస్యమైన సమయాన్ని మళ్లీ కేటాయించినట్లు సమాధానం ఇచ్చారు.

మల్లన్న ఆలయంలో సూర్య, చంద్రప్రభ వాహన సేవ

ఐనవోలు, మార్చి 6: ఐనవోలు మల్లికార్జునస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో వేదపండితులు సూర్య, చంద్రప్రభ వాహన సేవ నిర్వహించారు.

బాలిక కిడ్నాప్ కలకలం

సుబేదారి, మార్చి 6 : హనుమకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ మైనర్ బాలికను, మైనర్ బాలుడు కిడ్నాప్ చేసిన సంఘటన కలకలం సృష్టించింది. 9వ తరగతి చదువుతున్న విద్యార్థినికి ఇన్‌స్ట్రాగ్రామ్‌లో నగర శివారు కాలనీకి చెందిన బాలుడితో పరిచయం ఏర్పడింది. బుధవారం రాత్రి ఏడుగంటల సమయంలో ఇంటి నుంచి బయటికి వచ్చిన బాలికను సదరు బాలుడు బైక్‌పై తీసుకుపోవడంతో కుటుంబ సభ్యులు ఆరా తీసి 100కు కాల్ చేశారు. హనుమకొండ పోలీసులు ట్రేస్ అవుట్ చేయడంతో, బాలికను తన స్నేహితుడితో తిరిగి ఇంటికి పంపించాడు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

కాశీబుగ్గ, మార్చి 6: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు 8 నుంచి 10వ తేదీ వరకు మూడు రోజులపాటు సెలవు ఇస్తున్నట్లు కార్యదర్శి క్యారం సంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి మార్కెట్‌లో క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని రైతులకు సూచించారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు

వరంగల్, మార్చి 6 : బీఆర్ఎస్ పార్టీకి చెందిన 10 మంది కార్పొరేటర్లు అధికార కాంగ్రెస్ గూటికి చేరారు. మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఆధ్వర్యంలో కార్పొరేటర్లతో పాటు ఐదుగురు మాజీ కార్పొరేటర్లు, పలువురు డివిజన్ అధ్యక్షులు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. బుధవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ వీరిని పార్టీలో ఆహ్వానించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. కార్పొరేటర్ల జంపింగ్‌తో బల్దియాలో పార్టీల బలాబలాలు మారాయి. మారిన సమీకరణలతో 66 మంది సభ్యులున్న బల్దియాలో ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీకి 32 మంది కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీకి 24 మంది, బీజేపీకి 10 మంది ఉన్నారు.

టీయూడబ్ల్యూజే (హెచ్ -143) అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడిగా అనిల్‌కుమార్

హనుమకొండ, మార్చి 6: టీయూడబ్ల్యూజే (హెచ్ - 143) వరంగల్ జిల్లా యూనిట్ అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడిగా క్యాకర్ల అనిల్‌కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకొంది. వచ్చే రెండు నెలల్లో ఆ జిల్లాలో జరిగే పూర్తి స్థాయి కమిటీ ఎంపికలో క్రియా శీలకంగా వ్యవహరించాలని రాష్ట్ర కమిటీ ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించింది.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

- విశ్రాంత ప్రాఫెసర్ శోభ
- పలుచోట్ల ఘనంగా మహిళా దినోత్సవం

హనుమకొండ చౌరస్తా/హనుమకొండ, మార్చి 6 : మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని విశ్రాంత పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ప్రొఫెసర్ వీ శోభ అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేయూలో 'విమెన్ స్టేటస్ ఇన్ ది కాంటెంపరరీ సొసైటీ' అంశంపై బుధవారం నిర్వహించిన సదస్సులో ఆమె ప్రసంగించారు. విద్య, అక్షరాస్యత, ఆర్థిక పరిపుష్టితోనే మహిళా సాధికారత సాధ్యమన్నారు. విభాగ ప్రొఫెసర్ టీ యాదగిరిరావు, డాక్టర్ చీకటి శ్రీనివాస్, డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్, డాక్టర్ ఉమా శంకర్ పాల్గొన్నారు. అలాగే, హనుమకొండలోని కేడీసీలో మహిళా సాధికారత సమితి ఆధ్వర్యంలో మహిళల హక్కులు లింగ సమానత అంశంపై సదస్సును నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజారెడ్డి, సమితి కోఆర్డినేటర్ డాక్టర్ బీ నయనాదేవి మాట్లాడారు. అడ్వకేట్ పద్మజ, అకాడమిక్ కోఆర్డినేటర్ మల్లయ్య, అధ్యాపకులు మధుసూదన్‌రెడ్డి, గంట శ్యాం, లీలావతి, మాధవి, శ్రీదేవి, అనిత, సుధామాధురి, సునీత, చంద్రకళ, గాయత్రి, సుజాత, సరళ, పావని, రాజశ్రీ, సుజాత, ఉమా కిరణ్, శ్రవణ, రామారెడ్డి, మురళి, సోమ నరసయ్య, సోమన్న, సత్యనారాయణ పాల్గొన్నారు. సుబేదారిలోని అసంతభవన్‌లోని బాలరక్షలో ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన మహిళా దినోత్సవానికి అతిథులుగా జిల్లా సంక్షేమాధికారి మధురిమ, రిటైర్డ్ ప్రొఫెసర్ పద్మ, సీడబ్ల్యూసీ మెంబర్ హైమావతి, వరంగల్ సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వసుధ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ మెంబర్లు రాజేంద్ర ప్రసాద్, దామోదర్, రిటైర్డ్ ప్రొఫెసర్ కుమార్ స్వామి, డాక్టర్ పరికి సుధాకర్ పాల్గొన్నారు. కాగా, మహిళా దినోత్సవాన్ని గురువారం వడ్డేపల్లిలోని టీఎన్జీవో కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి మధురిమ ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళా కార్మికులకు సెలవు ఇవ్వాలి

వరంగల్ : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 8న మహిళా పారిశుధ్య కార్మికులు, ఉద్యోగులకు ఒక పూట సెలవు ప్రకటించాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బుధవారం బల్దియా సీఎంహెచ్‌వో రాజేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్మారాజు, పుల్లా రమేశ్, జన్ను ప్రకాశ్, ఆర్ భాస్కర్ పాల్గొన్నారు.

మిల్స్‌కాలనీ పీఎస్ తనిఖీ

ఖిలా వరంగల్, మార్చి 6: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌ను వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులతోపాటు నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరి రక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను ఇన్‌స్పెక్టర్ మల్లయ్యను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ట్రైనీ ఐపీఎస్ శుభం నాగ్, ఏసీపీ బీ కిషన్ ఉన్నారు.

ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహా శివరాత్రికి ఏర్పాట్లు

హనుమకొండ, మార్చి 6 : మహా శివరాత్రి పర్వ దినానికి వేళైంది. ఇందుకు హనుమకొండ బాలసముద్రంలోని హయగ్రీవాచారి మైదానం వేదికైంది. ఇండస్ ఫౌండేషన్ మహా శివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనానికి సర్వం సిద్ధం చేసింది. ఓరుగల్లు వైభవాన్ని, శివతత్వాన్ని చాటేలా ఆధ్యాత్మిక నిలయమైన ఓరుగల్లులో 2019 నుంచి ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఏటా లక్షకుపైగా భక్తులు హాజరయ్యేలా ఏర్పాటు చేస్తున్నారు. 2019లో తనికెళ్ల భరణి, 2022లో పద్మశ్రీ గరికిపాటి నర్సింహారావు, 2023లో మాడుగుల నాగఫణి శర్మ, గవర్నర్ తమిళిసై, జేడీ లక్ష్మీ నారాయణ పాల్గొనగా 2024లో భగవత్‌గీత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గంగాధర శాస్త్రి, హిందు సమాజాన్ని జాగృత పరుస్తున్న ఇస్కాన్ రాధా మనోహర్ దాస్ పాల్గొననున్నారు. అలాగే, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు జానపద గీతాలు, నృత్య ప్రదర్శనలు, కూచిపూడి, భారత నాట్యంతో పాటు జానపద కళలు, దేశభక్తి ప్రదర్శనలు నిర్వహించనున్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ చాటుతూ ఓరుగల్లుకు పూర్వ వైభవం తేవడం కోసం కృషి చేస్తున్న విశిష్ట వ్యక్తులను కాకతీయ పురస్కారంతో సన్మానించనున్నట్లు ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగు రాకేశ్‌రెడ్డి తెలిపారు.

కలెక్టరేట్‌లో ఫుడ్ ఫెస్టివల్

హనుమకొండ, మార్చి 6 : హనుమకొండ కలెక్టరేట్‌లో మహిళా అధికారులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో బుధవారం ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఫుడ్ ఫెస్ట్‌వెల్‌ను కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చెస్, క్యారమ్స్, మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్, టెన్నికాయిట్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ నీరజ, వైస్ ప్రెసిడెంట్ మాధవీలత, అసోసియేషన్ ప్రతినిధులు మాధవి, లావణ్య, రజిత రాణి పాల్గొన్నారు. అలాగే ఇటీవల మరణించిన మాజీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పంకజ్ ద్వివేదికి కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఇతర అధికారులు బుధవారం నివాళులర్పించారు. పంకజ్ ద్వివేది ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్‌గా 1985 -86లో పనిచేశారు. అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌వో గణేశ్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హనుమకొండ, మార్చి 6: ఉద్యోగులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంటుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో హనుమకొండ జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు ఆకుల రాజేందర్ అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం, డైరీ ఆవిష్కరణ, ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగారాజు జిల్లాలోని మహిళా ఉద్యోగులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, కేంద్ర సంఘ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, మాజీ అధ్యక్షుడు కారం రవీందర్ రెడ్డి, జేఏసీ మాజీ చైర్మన్ పరిటాల సుబ్బారావు, జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేశ్, నాయకులు కే వెంకటేశ్వర్లు, సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఊరుగొండలో శివపార్వతుల కల్యాణం

కల్యాణం నిర్వహిస్తున్న పూజారి రవీందర్‌శర్మ

దామెర, మార్చి 6 : మండలంలోని ఊరుగొండ శివాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. శివపార్వతులకు గోగుల సత్యనారాయణ రెడ్డి దంపతులు మట్టెలు, పుస్తెలు, కునాటి సునీల్‌రెడ్డి, సందీప్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు, రాజిరెడ్డి మట్టెలను తీసుకురాగా, అర్చకులు రవీందర్‌శర్మ కల్యాణం జరిపించారు. వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, కృష్ణారెడ్డి, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నెర్రెలు పడ్డ పంట పొలాలు

ఖానాపురం, మార్చి 6: పాకాల ఆయకట్టు పరిధిలో సాగు చేసిన పంట పొలాలు ఆదిలోనే నీరందక ఎండిపోతున్నాయి. పాకాల పూర్తిస్థాయి ఆయకట్టు 28,500 ఎకరాలు. ఈ యాసంగిలో సంగెం 8 వేలు, తుంగబంధం 3 వేలు, జాలుబంధం 2500, పస్నూరు వెయ్యి, మాటువీరారం కింద వెయ్యి ఎకరాలు సాగు చేశారు. కొద్ది రోజులుగా సంగెం కాల్వ పరిధిలోని మనుబోతులగడ్డ, బుధరావుపేట శివారులోని పంట పొలాలకు నీరందక నెర్రెలువారుతున్నట్లు అన్నదాతలు వాపోతున్నారు. అధికారుల సమన్వయ లోపంతో పంటలకు సక్రమంగా నీరందించలేక పోతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మనుబోతులగడ్డ శివారులో ఎండిపోతున్న పంట పొలాలు

ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఉపేంద్రశర్మ

నేపాల్ రుద్రాక్షల ఎగ్జిబిషన్

హనుమకొండ, మార్చి 6 : మహా శివరాత్రి పర్వ దిన్నాన్ని పురస్కరించుకొని నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో నేపాల్ రుద్రాక్షల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. దీన్ని గురువారం తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా శివరాత్రి శుక్రవారం రావడం మహాభాగ్యమన్నారు. నేపాల్ పశుపతినాథ్ ప్రాంతంలోని ఈ రుద్రాక్షలు మహాశివరాత్రి రోజు ధరించడం వల్ల సకల ఐశ్వర్యాలు